# రేషన్ కార్డు - శేషన్ కార్డు

చాలాకాలం వరకూ మాకు రేషన్ కార్డు లేదు. మా ఊరు వదిలి చదువుల నిమిత్తం, ఉద్యోగాల నిమిత్తం ఊళ్ళెన్నో తిరిగిన నేను ముందస్తుగా రేషన్ కార్డుని గురించి అట్టే పట్టించుకోలేదు. ప్రభుత్వం వారు పేదప్రజలకు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం ద్వారా, ముఖ్యంగా రెండు తిండిదినుసులు - అంటే గోధుమల్నీ, బియ్యాన్నీ, ఒక తీపి సరుకు - అంటే పంచదారనీ, దీపాల్ని వెలిగించడానికి లేదా వత్తుల స్టవ్‌లో వాడే కిర్సనాయిల్నీ - వెరసి నాలుగు నిత్యావసర పదార్థాలని, అందుబాటు ధరల్లో అందించడానికి కంకణం కట్టుకోవడంతో తాలూకాల్లో సివిల్ సప్లై ఆఫీసులు, ఊళ్ళలో రేషన్ ఆఫీసులూ వెలిసాయి. అనవాలు కోసం కుటుంబానికి రేషన్

కార్డు ఉండాలన్నారు.

రేషనాఫీసు ఆఫీసర్లు, రేషన్ కార్డు కోసం అర్జీ పెట్టుకొన్నవారి యిళ్ళకు వెళ్ళి, అన్ని తలలూ ఉన్నాయో లేవోనని నిర్ధారణ చేసుకొని, అక్కడికేదో మహోపకారం చేసినట్టుగా కుటుంబ సభ్యుల జాబితాని రేషన్ కార్డులోకి ఎక్కిస్తారు. నేల మీద పాకే పాపాయి దగ్గర్నుంచీ, నడుం వంగిన తాతయ్యల వరకూ ఆ కార్డులో నమోదవుతారు. అందుకే ఈ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లూ, సంఖ్యా ప్రధానంగాని, పుట్టుమచ్చలకీ, ఫోటోలకీ, సంతకాలకీ అస్కారమూ లేదు, జాగా లేదు. లొసుగంతా యిందులోనే ఉంది.

రేషన్ కార్డుకి ఆదాయపు హద్దులు నిర్ణయించడంతో, తలకింత పంచదార తప్ప, చాలామంది రేషన్ కార్డు హోల్డర్సుకి మరేమీ దొరకవు. అదీగాక, మార్కెట్లో ఫ్రీగా దొరుకుతుండగా, ఆ యిచ్చే కాస్త పంచదార కోసం ఎవరూ ప్రయాసపడరు. ఎందుకంటే పనిగట్టుకొని వెళ్ళినప్పుడు రేషన్ షాపులో స్టాకు ఉండదు. ఆదారిలో యథాలాపంగా వెడ్తున్నప్పుడు స్టాకుందని బోర్డు ఉన్నా, దగ్గరేమో రేషన్ కార్డు ఉండదు. అయితే ఏడాది పాటూ ఏమీ తీసుకోకపోతే కార్డు కొండెక్కే ప్రమాదం ఉంది. కాబట్టి, మధ్య మధ్యలో ఆ యిచ్చేవేవో కాస్త తెచ్చుకొని, కార్డుకి జీవం పోస్తూ ఉండాలి.

1960-70లలో కలకత్తాలో బియ్యం దొరికేవి కావు. అందుకని ఆదాయంతో నిమిత్తం లేకుండా వారానికిన్నని ఉప్పుడు బియ్యాన్నిచ్చేవారు. అస్సాం నుంచి కలకత్తా బదిలీ అయిన నాకు రేషన్ కార్డు చేయించుకోవలసిన అగత్యం ఏర్పడింది. పూర్వపు చోటులో ఉన్న కార్డుని అక్కడే సరండర్ చేసినట్టు ఓ సర్టిఫికేట్ తీసుకొని, కొత్త చోటులో ఆ కాయితం అప్లికేషన్‌తో పాటు సమర్పించుకొంటే, కొత్త రేషన్ కార్డు చేయించుకోవడం కాస్త సులువైన పని. కలకత్తాలో రేషన్ కార్డు చేయించుకోవడానికి, అంతకు ముందు మాకు రేషన్ కార్డు లేదు మహాప్రభో అని ఓ అఫిడవిట్ సమర్పించుకొని, రెండు నెలల తర్వాత ఎలాగో విజయం సాధించి, మేమిద్దరమూ, మా కిద్దరూ, మొత్తం నాలుగు పేర్లున్న రేషన్ కార్డుకి నోచుకొన్నాం. అప్పటునుంచీ దాన్ని చాలా జాగ్రత్తగా చూసుకొంటూ, ఊరు మారినప్పుడల్లా ఓ చిన్న సర్కస్ చేసి దాన్ని కూడా కొత్తచోటుకి బదిలీ చేయించుకోవడం అలవాటైపోయింది.

పోను పోను రేషన్ కార్డు ప్రాముఖ్యత పెరుగుతూ వచ్చింది. సరిహద్దు దాటి మన దేశంలో నలుమూలలా విస్తరించిన అక్రమ వలసదారులు ముందుగా రేషన్ కార్డు సంపాదిస్తే ఓటర్ల జాబితాలోకి ఎక్కడం, ఓటర్ల జాబితాలో పేరుంటే రేషన్ కార్డు సంపాదించడం జరిగింది. అందుకనే అటు అస్సాంలో గొడవలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. యిటు బాల్‌థాకరే గొడవ పెట్టాడు. పెడ్తూనే ఉన్నాడు. ఈ రేషన్ కార్డు ఓ కవచం అయి కూర్చుంది చాలా మందికి.

గ్యాస్ కనెక్షన్ నుంచి పాస్‌పోర్టు వరకూ, బాంక్ ఎకౌంట్ ఓపెన్ చేయ్యడం దగ్గర్నుంచి, కుటుంబ సభ్యుల్లో రైల్వేరిజర్వేషన్ మార్పిడి వరకూ, ఈ రేషన్ కార్డు చాలా ముఖ్యమైన పరికరంగా,

అనవాలు పుస్తకంగా ఓ పరమ విశిష్టమైన స్థానాన్ని సంపాదించి కూర్చుంది.

ఊర్నించి ఊరు బదిలీల సంగతటుంచి, ఊళ్ళోనే యిల్లు మారినప్పుడు 'బొంబాయి'- క్షమించాలి 'ముంబయ్' లాంటి మహా నగరాల్లో ఈ రేషన్ కార్డుని విస్మరించకూడదు. ఎందుకంటే అది మీ చిరునామాకి సాక్ష్యపత్రం. పదవీ విరమణ చేసిన తర్వాత 'బాంద్రా'లోని కంపెనీ క్వార్టర్సు వదిలిపెట్టి చెంబూరు మకాం మార్చినప్పుడు ఎడ్రసు మార్పిడికి, 'బాంద్రా' సివిల్ సప్లై జోనల్ ఆఫీసుకి అర్జీ పెట్టుకొన్నాను. వాళ్ళొక ఫారం యిచ్చి దానిమీద అక్కడక్కడా ఏవో మరాఠీలో వ్రాసి, మిగతా వివరాలు నన్ను పూర్తి చెయ్యమనీ, ఆ ఫారంతో బాటు రేషన్ కార్డుని చెంబూరు జోనల్ ఆఫీసులో ఇవ్వమనీ చెప్పారు. సరే ఆ ఫారాన్ని పూర్తి చేసి దాన్ని మా రెండో ప్రబుద్ధుడికిచ్చి, చెంబూరు ఆఫీసులో యివ్వరా అంటే, వాడు దాన్ని అలాగే అని తీసుకొని, దాని సంగతి మరిచిపోయి వాడు పన్జేస్తున్న ఆస్పత్రికి వెళ్ళిపోయాడు. నెల రోజుల తర్వాత దాని సంగతి వాడికి గుర్తు చేస్తే, రేషన్ బుక్ ఉంది కాని, ఫారం ఎక్కడుందో కనబడట్లేదన్నాడు. ఆస్పత్రిలో వాడి గదిలోనూ, మా యిల్లంతా వెదికాం. ఎక్కడా కనిపించలేదు. సరే ఫారమే కదా మరోటి తీసుకొని పూర్తి చెయ్యవచ్చు కదా అని చెంబూరు ఆఫీసుకి వెళ్ళాను. 'ఇది బాంద్రా కార్డు. ఫారం వాళ్ళే యిస్తారు. ఆ ఫారంతో యిక్కడికి రండ'న్నారు.

సరే కదాని బాంద్రా ఆఫీసుకి వెళ్ళాను. దాన్నేదో 'బి' ఫారం అంటారట. యిమ్మని అడిగాను. వాళ్ళు నా రేషన్ కార్డు నంబరు చూసి, వాళ్ళ రిజిష్టరు తీసి చూశారు. "మీకిదివరకే 'బి' ఫారం యిచ్చాం. అదేమైందని" అడిగారు. పోయిందన్నాను. 'మీకిచ్చిన ఫారం అల్లాటప్పా ఫారం కాదు, దాని మీద సీరియల్ నంబరుంది మా ఆఫీసు ముద్ర ఉంది. అందుచేత మీరు పోలీసు స్టేషన్‌కు పోయి ఫారం పోయిందని ఫిర్యాదిచ్చి, వాళ్ళ దగ్గర్నుంచి N.O.C. అంటే 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ తీసుకొస్తే కొత్త 'ఓ' ఫారం యిస్తాం. ఇదేమీ రైల్వే రిజర్వేషన్ ఫారం లాంటిది కాదు, ఒకటి చించి మరోటి వ్రాయడానికి' అంటూ ఓ నలభై ఏళ్ల సెక్షనాఫీసరు చాలా కటువుగా, మొరటుగా, అసలు ఈ రేషనాఫీసుకొచ్చే వాళ్ళందరూ దొంగరాస్కెల్స్ అన్నట్టుగా మాట్లాడి, తన అధికృత చూపించుకొంది. చెంబూరు పోలీస్ స్టేషనాఫీసర్ని కలుసుకొని, నా వివరాలు చెప్పుకొని అర్జీ పెట్టుకొన్నాను. ఆయన విద్యాధికుడు కావడం మూలాన కాస్త మర్యాదాగా మాట్లాడాడు. 'ఈ ఫారం చాలా విలువైనది. మీరు ముందు ముందు ఈ రేషన్ కార్డు వ్యవహారాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి' అని ఓ సలహా ఇచ్చి తన సరదా తీర్చుకొన్నాడు. వెంటనే యివ్వడం జరగదనీ, ఏదో ఇన్వెస్టిగేషన్ జరిగినట్టు చూపించి ఓ వారం రోజుల తర్వాత యివ్వగలననీ చెప్పాడు. ఆయన అన్న మాట నిలబెట్టుకొన్నాడు.

ఆ N.O.C. తో మరో 'బి' ఫారం బాంద్రా ఆఫీసు నుంచి తీసికొని, చెంబూరు ఆఫీసులో రేషన్ కార్డుతో సహా జమ చేశాను. తనిఖీ ఆఫీసరు ఫలానా రోజున వస్తానని తేదీ యిచ్చాడు. ఆయనగారొచ్చే రోజున అందర్నీ బలవంతంగా ఆఫీసులు మాన్పించి ఇంట్లో కూర్చోపెట్టాను. తనిఖీ పూర్తయిన తర్వాత ఆయన్ని కాస్త సంతోషపెట్టి, ఎడ్రసు మార్పిడి, జోన్ మార్పిడి,

ఏరియా రేషన్ షాపు నెంబరూ సాధించి, రేషన్ షాపు వాడి రిజిష్టరులో ఈ రేషన్ కార్డు వివరాలు వ్రాయించిన తర్వాత కాని నాకు నిద్ర పట్టలేదు.

అంతా అయిన తర్వాత అదే ఆఫీసరు, 'మీరు పదవీ విరమణ చేసిన తర్వాత, ఇక్కడ మీ కుర్రాడితో బాటు అతగాడి కంపెనీ క్వార్టర్సులో ఉంటున్నారు కదా. కంగారేమీ లేదు కానీ, వీలైనంత త్వరలో 'హెడ్ ఆఫ్ ది ఫామిలీ' గా మీ కుర్రాడి పేరు వ్రాయించండి. దానికి ఫారం హెచ్ పూర్తి చేసివ్వండ'ని ఓ సలహా యిచ్చి పారేశాడు. దాన్ని గురించి నేను మళ్ళీ వెంటనే ప్రయత్నం చెయ్యలేదు. ఎందుకంటే మా కుర్రాళ్ళకీ, కోడళ్ళకీ పాస్‌పోర్టులు సంపాదించవలసిన అవసరం వచ్చింది. సరే ఈ గొడవైంతర్వాత, రేషన్ కార్డు గొడవ చూసుకోవచ్చునని వాయిదా వేశాను.

ఇదిలా ఉండగా -

క్రితంసారి ఎన్నికల్ని ప్రక్షాళనం చేసి శుద్ధిచేసే ప్రయత్నంలో శేషన్ మహాశయులు జాతీయ గుర్తింపు కార్డు అనేది ప్రవేశపెట్టినప్పుడు, పార్టీలు మూతులు ముడుచుకొన్నా, సంతోషించిన సామాన్య జనాల్లో నేనూ ఒకణ్ణి. ఏడ్చుకోడానికి వెయ్యి కారణాలక్కర్లేదు. ఒక్కటి చాలు. దొంగ ఓట్లు వెయ్యడానికీ, వేయించుకోవడానికీ అస్కారముండదని వాళ్ల బెంగ. అలాగని కత్తులూ, తుపాకీలూ చూపించి బెదిరించి, అటు పోలింగాఫీసర్లకీ, ఇటు ఓటర్లకీ ప్రాణభీతి కలిగించి, ఓట్లమీద ముద్రలు వెయ్యడానికి అస్కారంలేదని కాదు. మహరాజులా ఉంది. అయితే కాస్త రిస్కుతో కూడుకున్న వ్యవహారం. ఇది జరగకుండా ఉండాలంటే, పోలీసులు కానీండి, రక్షక దళాలు కానీండి, దౌర్జన్యవాదుల నడుం విరగొట్టాలి. ఈ అంశాన్ని కనక తొలగిస్తే, ఎలక్షన్ కమీషన్ గుర్తింపు కార్డుతో వోటింగ్ సక్రమంగా జరిగే అవకాశం చాలా చాలా పెరిగిపోతుంది.

రాజీవ్ గాంధీ ఎన్నో ఏళ్ళ తర్వాత, ఓటర్ల లిస్టు తగాదాల వల్ల వాయిదా పడ్డ ఎలక్షన్లని, చివరికెలాగైతేనేం ప్రకటించాడు. అప్పుడు నేనా రాష్ట్రంలో పనిచేస్తూండడం జరిగింది. ఎలక్షన్ల ప్రచారం కోసం మా కాలనీలో ఉన్న క్వార్టర్సుని అభ్యర్థుల చెంచాలనండి, ప్రచారకులనండి పలుమారులు సందర్శించారు. అప్పటికి అధికారంలో ఉన్న ఓ అభ్యర్థి, ఈ కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఓట్లన్నీ తనకేనన్న ధీమాతో ప్రవర్తించాడు. అతని ప్రచారకులందరూ మా కంపెనీ అతిథి గృహంలో తిష్ట వేసుక్కూర్చున్నారు. కాలనీలో ఉన్న సెంట్రల్ స్కూల్లో పోలింగు జరిగింది.

విద్యాధికులైన ఉద్యోగులు యింట్లో కూర్చోకుండా ఓటు హక్కుని వినియోగించాలనే నమ్మకమున్నవాణ్ణి కాబట్టి, పది గంటల ప్రాంతాన నేనూ, శ్రీమతీ మాకు నిర్ధారితమైన బూత్ దగ్గరకు వెళ్ళాం. ఓటర్ల జాబితాని పరిశీలించిన వ్యక్తి, "క్షమించండి. మీ ఓట్లు వేసెయ్యడం జరిగింది!" అన్నాడు, మా మొహాల మీదుగా సీలింగ్ వైపు చూస్తూ. చూపుడు వేలు చూపిస్తూ ఇంకు గుర్తు ఎక్కడుందో చూపించమన్నాను. ఆ వ్యక్తి ఇబ్బందిగా లిస్టు ముందరకి జరిపి. బ్యాలట్ పత్రం యిచ్చిన దాఖలా చూపించాడు. వాదించి లాభం లేదు. వ్రేలాడిన మొఖాలతో బయట అడుగు పెడ్తుండగా, ఓ యిద్దరు యువతీ యువకులు నవ్వుతూ, "అంకుల్, మీరెవరికి

ఓటు వేద్దామనుకొన్నారు?" అని ప్రశ్నించారు. నా శ్రీమతి సంగతి తెలియదు కాని నేను మట్టుకు ఫలానా అభ్యర్థికి వేద్దామనుకొన్నానని చెప్పాను. శ్రీమతి కూడా అదే వ్యక్తికి ఓటు వేద్దామనుకొందిట.

"అలాగైతే మీకు బెంగ అనవసరం. మీరెవరికైతే అనుకొన్నారో, అతనికే మీ ఓట్లు వెయ్యడం జరిగింది. మీ ఉద్దేశ్యం నెరవేరినప్పుడు, ఓట్లని ఎవరు డబ్బాలో పడేసినా ఒకటే!" అని వాళ్ళిద్దరూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. ఆ సెంటర్లో నూటికి నూరు శాతం పోలింగు జరిగింది. అధికారంలో ఉన్న అభ్యర్థి తీవ్ర పరాజయం పొంది మా కంపెనీ మీద కారాలు, మిరియాలు నూరడం జరిగిందని విన్నాను. కొత్తపార్టీ అభ్యర్థి అఖండమైన మెజారిటీతో గెలిచాడు.

చిత్రమేమిటంటే, అంతకు పూర్వం ఓ రెండు ఎలక్షన్లలో ఒకటి అహ్మదాబాద్‌లోనూ, మరొకటి డెహ్రాడూన్‌లోనూ ఓటు వేద్దామనుకొన్న పార్టీ అభ్యర్థులు మంచి చరిత్ర కలవాళ్ళు కాదని తెలిసి, స్వతంత్రులకి (ఇండిపెండెంట్లకి) వేశాను. ఆ స్వతంత్రులు నెగ్గారు. కానీ వాళ్ళు, నేననుకొన్న పార్టీకి ప్రతిపక్షంలో చేరి పదవులు సంపాదించు కొన్నారు! అది వేరే విషయం. ఓటు వెయ్యడం వరకే మన విధి. ఆ తర్వాత వాళ్ళేం చేస్తారో వాళ్ళకీ తెలియదు. మనకీ తెలియదు.

అందుకనే బొంబాయి – అదే ముంబాయ్‌లో ఉండగా జరిగిన క్రితం ఎలక్షన్లలో, ఎలక్షన్ కమీషన్ వారిచ్చే గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలనడంతో, ఇంట్లో ఉన్న అందర్నీ లేవదీసి ఉదయం ఎనిమిది గంటలకల్లా వెళ్ళి దగ్గర్లోనే ఉన్న హైస్కూలు సెంటర్‌కి వెళ్ళాం మాకిచ్చిన చిన్న 'స్లిప్'తో – ఆ స్లిప్ చూసి, అంతకుముందు నెల రోజుల క్రితం మా యింటికొచ్చి, రేషన్ కార్డు చూసి, వివరాలు వ్రాసుకొన్న కాయితాలు బయటికి తీశారు. తప్పులున్నాయేమో చూసుకోమన్నారు. చూసి తప్పులు సరిదిద్దాం. వీడియో కెమేరాల ఫోటోల్లో దిగబడ్డాం. నెల రోజుల తర్వాత, ఆ కంట్రాక్టరు వీడియో ఫోటోలు సరిగా రాలేదు, 'మళ్ళీ' అన్నారు. సరేననుకొంటూ, మరోసారి ఆ సెంటర్ని దర్శించాం. చివరికెలా అయితేనేం కార్డులు చేతికొచ్చాయి. పేడముద్దల్లా ఉన్న మొహాలతోటి, తండ్రి పేరు లేకుండా, భర్త పేరు లేకుండా, మధ్య పేరు తండ్రి పేరు కెదురుగా, ఎడ్రసు సరిగా లేకుండా – వాళ్ళ యిష్టం వచ్చినట్టు తయారుచేసి యిచ్చారు. ఎలక్షన్ కమీషనర్ శేషన్ అజ్ఞల్ని రాష్ట్ర ప్రభుత్వాలూ, రాజకీయ నాయకులూ నోటితో కాదనకుండా, చేతలతో చెడగొట్టారు! లక్షలు వెచ్చించి లక్ష్యం తగలబెట్టారు!

ఆ ఎన్నికల్లో ఓటు వేశాం. కాని గుర్తింపు కార్డుని ఎవరూ అడగలేదు. అయితే ఈ గుర్తింపు కార్డు కోసం 'ఎందుకు నీ గోల?' అని అడగవచ్చు. దానికి కారణాలున్నాయి. అస్సాంలో ఎన్నికల అనుభవం ఒకటి. ఇకపోతే –

1968వ సంవత్సరం. ఓ ఆదివారం నేనూ, కలకత్తా చూడ్డానికి వచ్చిన నా బావమరిదీ 'డల్హౌసీ స్క్వేర్' లో తిరుగుతుండగా వానొచ్చింది. అక్కడే ఉన్న 'గ్రేట్ ఈస్టరన్ హోటల్ ఆర్కేడ్'లో నిల్చున్నాం, వర్షం తగ్గడం కోసం ఎదురు చూస్తూ. పక్కనే పేవ్‌మెంట్ మీద, బస్‌స్టాప్ స్తంభం

దగ్గర ఓ నడివయసు వ్యక్తి, గొడుగేసుకొని నిల్చున్నాడు, ఎక్కవలసిన బస్సు కోసం ఎదురు చూస్తూ, ఏ బస్సెక్కాలనుకొన్నాడో ఎవరికీ తెలియదు కాని, ఓ బస్సు మట్టుకు వచ్చి అతని మీదకు ఎక్కేసింది. అక్కడికక్కడే ప్రాణాలు పోయాయి. జనం గుమిగూడారు. పోలీసులు వచ్చారు. జేబులో పర్సు ఉంది. ఓ రెండు పదుల నోట్లు, కాస్త చిల్లరా ఉన్నాయి. మరేవిధమైన అనవాలూ లేదు. బయటకు వెళ్లి తిరిగి యింటికి రాని ఆ వ్యక్తి మరణం కబురు ఎన్ని రోజుల తర్వాత అతని ఆత్మీయులకీ తెలిసిందో, అసలు తెలియనే లేదో నాకు తెలియదు. ఏదో కాస్త విమాన ప్రమాదాలు మినహాయించి (శవాల్ని గుర్తుపట్టలేకపోయినా కనీసం మరణించిన వారి పేర్లు తెలుస్తాయి), రైలు, బస్సు, పడవ తదితర ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న జనాలు, బ్రతికిఉన్న ఆత్మీయులకీ, బంధువులకీ ఎంతో మనస్తాపాన్ని కలిగిస్తారు. ఆచూకీ తెలియని మరణాలు ప్రమాదాల వల్లనే సంభవించినక్కర్లేదు. పొరుగూరు పనిమీద వెళ్ళి గుండాగి పోవచ్చు. మీరు చెప్తే నమ్మరు, నేను యిల్లు వదిలి దగ్గర్లో ఉన్న కూరల మార్కెట్‌కి వెళ్ళినా, నా కంపెనీ వాళ్ళ గుర్తింపు కార్డు జేబులో పెట్టుకొని వెడ్తాను.

అహ్మదాబాద్‌లో M.S. చేసిన మా రెండో వాడికి ముంబాయిలో M.Ch. లో ఎంట్రన్సు పరీక్ష వ్రాసిన తర్వాత, పీడియాట్రిక్ సర్జరీ సీటొచ్చింది. ఎడ్మిషన్‌టైంలో ఇండియన్ నేషనల్ అంటే భారత పౌరుడని తహశీల్దారు సర్టిఫికెట్ కావాలన్నారు. సిబ్‌సాగర్ (అస్సాం) ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టినట్టు ఆ ఊరి జనన మరణ రిజిస్ట్రారు ఆఫీసు యిచ్చిన బర్త్ సర్టిఫికెట్ పనికిరాదన్నారు. అనంత్‌నాగ్ శ్రీనగర్ వాలీ నుంచి, ప్రాణభీతితో వలస వచ్చి ఢిల్లీ శిబిరాలలో ఉంటూ, అక్కడ మెడిసిన్ పాసయిన విద్యార్థి, కావాలంటే రిఫ్యూజీస్ స్పెషల్ సెల్ కమీషనర్ నుంచి సర్టిఫికేట్ తీసుకొస్తా కాని, అనంతనాగ్ తహశీల్దారు నుంచి రెండు రోజుల్లోపల సర్టిఫికేట్ తీసుకురావడం కుదరదన్నాడు. వీళ్ళూ కుదరదన్నారు. ఇలాంటివే అరడజను కేసులు. వాళ్ళు ఇది మెడికల్ కౌన్సిలు రూలన్నారు. అయితే ఎం.బిలూ, ఎమ్.ఎస్‌లూ ఇప్పటికే పూర్తిచేశాం. మళ్ళీ ఎమ్.సిహెచ్‌లో ఇదెందుకు అన్నారు వీళ్ళు. అదంతే అన్నారు వాళ్ళు. అంటే మేం ఈ దేశంలోని ఇతర రాష్ట్రాలలో పుట్టడం వల్ల, ఆ రాష్ట్రలే భారత దేశంలో ఉన్నాయా లేదా అని మీరు తహశీల్దారు నుంచి సర్టిఫికేట్ అడుగుతున్నట్టే అని వీళ్ళు విరుచుకుపడ్డారు. కోర్టుకెళ్ళి 'స్టే' తీసుకొస్తామని కొందరు బెదిరించారు. అంతలో తల నెరిసిన ఓ గుమాస్తా ఏడుగురు డాక్టర్ల కౌన్సిల్‌కి, తగాదా పడ్తున్న విద్యార్థులకీ ఓ ధర్మసూక్ష్మం చెప్పాడు. మీరంతంత దూరాలు వెళ్ళి రెండు రోజుల వ్యవధిలో ఈ సర్టిఫికేట్‌ని తీసుకురావడం కష్టం కనుక, కోర్టు నుంచి అఫిడవిట్ తీసుకురండి అని చెప్పాడు. మా ఆఫీసుకు దగ్గరగా ఉన్న ఓ నోటరీ దగ్గరకు వెళ్ళి అఫిడవిట్ కోసం మా కంపెనీ వాళ్ళ I.D. కార్డు. మా కుర్రాడి బర్త్ సర్టిఫికెట్ వగైరాలు చూపించాం. ఎడ్రసు వెరిఫికేషన్ కావాలన్నాడు. కంపెనీ క్వార్టరు ఎలాట్‌మెంట్ లెటర్ తీసుకొస్తానన్నాడు. కాదు, రేషన్ కార్డు తీసుకురమ్మన్నాడు!

మా వాడికి ఎడ్మిషన్ జరగడం, చదువు పూర్తవడం జరిగిందనుకోండి. ఇటువంటి సర్టిఫికేట్

అడగటంలో వాళ్ళకున్న కారణాలు వాళ్ళకి ఉండొచ్చు. అటువంటప్పుడు ప్లస్ టూ అయ్యేటప్పటికి విద్యార్థులు మేజర్లవుతారు కాబట్టి H.S.C. సర్టిఫికేట్‌తో బాటు ఈ జాతీయ పౌరసత్వపు గుర్తింపుపత్రం యిస్తే, అది సర్వతోముఖంగా పనిచేస్తుంది. పోతే ముఖకవళికల్లో మార్పులొస్తాయి కాబట్టి, పదేళ్ళకో కొత్త ఫోటో పక్క పేజీల్లో అతికించి అధికార ముద్ర వేయొచ్చు. ఒక్క విద్యార్థులకే కాదు, అందరు పౌరులకీ పదహారు, పదిహేడు సంవత్సరాలు వయసు వచ్చేసరికి ఈ కార్డులు తప్పనిసరిగా యివ్వాలి.

ఇందాక చెప్పినట్టుగా మా కొడుకులకీ, కోడళ్ళకీ పాస్‌పోర్టుల అవసరం వచ్చింది. ఆ సమయానికి రేషన్ కార్డులో వాళ్ళ అందరి పేర్లూ ఉన్నాయి. ఎలక్షన్ కమీషన్ కార్డులు కూడా లభించాయి. పాస్‌పోర్టు ఆఫీసుకి వెళ్ళి అప్లికేషన్‌తో బాటు E.C. కార్డు జిరాక్స్ యిచ్చి, ఒరిజినల్ చూపించారు, దాన్ని ఏ ప్రభుత్వపు వ్యవహారాల్లోనైనా ఉపయోగించుకోవచ్చునని వ్రాసి ఉండడంవల్ల. "ఇదేమిటి ఇందులో బాంద్రా ఎడ్రసుంది. మీ అప్లికేషన్‌లో చెంబూరు ఎడ్రసు ఉంది? తండ్రి పేరు కెదురుగా మీ మధ్య పేరుంది! భర్త పేరు లేదు! పోయి రేషన్ కార్డు పట్టుకురండి!" అన్నారు వాళ్ళు. వీళ్ళ దగ్గర రేషన్ కార్డూ, జిరాక్సులూ ఉండడం మూలాన వెంటనే యిచ్చారు. "ఇవి ఉండగా అవెందుకిచ్చారు. అనవసరంగా మా టైం వేస్ట్ చేశారు!" అని విసుక్కున్నారు వాళ్ళు. ఆ తర్వాత పోలీసులు వెరిఫికేషన్ కోసం వచ్చినప్పుడు ముందస్తుగా రేషన్ కార్డు చూశారు! సరే ఓ నెలా పదిహేను రోజుల తర్వాత, మూడుసార్లు ప్రదక్షిణలు చేసినతర్వాత పాస్‌పోర్టులు దొరికాయి.

ఈ మధ్యన ఇళ్ళకొచ్చి, ఫోటోలు సహితం తీసి, టూ ఇన్ వన్‌లూ, త్రీ ఇన్ వన్‌లూ అంటూ అనేక రకాలయిన ఎకౌంట్లు ఓపెన్ చేయించే పథకాలు అనేక బ్యాంకులు నగరాల్లో ప్రవేశపెట్టాయి. టెలిఫోనులో మాట్లాడిన మరుసటి రోజు ఓ పాతికేళ్ళ కామర్సు గ్రాడ్యుయేట్ కెమేరాతో సహా ఊడిపడ్డాడు. గుర్తింపు కార్డు ఏదైనా ఉందా అని అడిగాడు. పదవీవిరమణ చేసిన తర్వాత మా కంపెనీ యిచ్చిన ప్రత్యేక గుర్తింపు కార్డు చూపించాను. పనికిరాదన్నాడు. శేషన్ కార్డు చూపించాను. పెదవి విరిచాడు. "అంకుల్, రేషన్ కార్డుంటే చూపిస్తారా?" అన్నాడు కాస్త యిబ్బందిగా. చూపించాను. సంతోషంగా చెక్కు తీసుకొని వెళ్ళాడు. రెండోరోజుకల్లా పాస్‌బుక్కూ, చెక్కు బుక్కూ వచ్చాయి!

రేషన్ కార్డుని కావల్సినవాళ్ళకే పరిమితం చేసి, ఇతర అవసరాలకి కావల్సిన ఓ జాతీయ గుర్తింపు కార్డుని యివ్వడం అర్థవంతమైన పని. అందుకనే 'శేషన్ కార్డు' అంటే ఎగిరి గంతేశాను. కాని ఏం జరిగిందో మీరు చూశారు!

శ్రీ రామాంజనేయ యుద్ధంలో హనుమంతుడు రామభక్తితో రాముణ్ణి ఓడించినట్లు, బ్యూరోక్రసీతో బలాన్ని పుంజుకొన్న రేషన్ కార్డు, అతి సమర్థవంతుడైన బ్యూరోక్రాట్ శేషన్ ప్రవేశపెట్టిన కార్డుని వెలుగు చూడకుండా చేసింది.

*(కథో, కాకరకాయ వ్యాసమో, దీన్ని శేషన్‌గారికి అంకితం చేస్తున్నాను.)*